# రాత్రి

గరిమెళ్ళ నాగేశ్వరరావు

నగరాన్ని నాలుగు వైపుల నుండీ వాటేసుకుంది చీకటి. దానిని చీల్చేందుకు...నగరం విద్యుత్ దీపాల కాంతుల్ని..కత్తుల్లా రువ్వింది గాయ పడ్డ చీకటి. దేహం నిండా గాయాల్లా...దీపాల వెలుగులు. నగరానికీ చీకటికీ మధ్య జరుగుతోన్న యుద్ధంతో...తనకేం సంబంధం లేదన్నట్టు...ప్రశాంతంగా నిదురోతోన్న ప్రపంచపు దేహమ్మీద...వాడెవడో పేడ పురుగులా ప్రాకుతున్నాడు.

వేళకాని వేళ...ఇంత రాత్రి వేళ...సందులూ...గొందులూ...మేడలూ...గోడలూ... తలుపులూ...గడపలూ...

ఆశగా...ఆబగా...భయం...భయంగా...దేని కోసమో వెతుకుతున్నాడు.

వాడు, "సింహాచలం!" సింహాచల మంటే, సినిమా హీరోనో, మాజీ మంత్రి గారో...కాదు.

అమ్మెవరో...నాన్నెవరో...తెలీకుండా చరిత్ర చెత్త కుండీలోంచి పుట్టు కొచ్చిన, కర్ణుడు.

చెవ్వలు కుట్టుకు బతికే బాబులు తాత పెంపకంలో పెరిగి...పెరిగి...నాయర్ టీ కొట్లో చేరిన పనోడు.

ఎవరో చేసిన దొంగతనం...నెత్తిమీద కొస్తే...కటకటా లన్నింటినీ కసిగా లెక్కించి...లెక్కించి...బయటి కొచ్చిన మాజీ ఖైదీ.

అడుగడుగునా...వెంటాడుతోన్న జైలు జీవితం వెక్కిరిస్తుంటే...పనెక్కడా...దొరక్క...తిరిగి...తిరిగి విసిగిపోయి దొంగతనం చెయ్యాలని నిశ్చయించుకొన్నాడు...వాడు.

ఆ ప్రయత్నంలోనే...అదిగో బ్యాంకు చుట్టూ...తిరుగుతోన్నాడు. గన్ను చేత పట్టుకు తిరుగుతోన్న వాచ్‌మెన్, బర్‌గ్లర్....వ మోతపెట్టే...అలారం...అంత సులభంగా తెరచుకోని, స్ట్రాంగ్‌రూం తలుపులూ...తలచుకొని... నిట్టూరుస్తూంటే...బాల నాగమ్మ కథలో మాయల ఫకీరు ప్రాణం దాచిన మట్టిచెట్టు గుర్తొచ్చింది.

"ఎవరెవరో దోచుకొన్న సొమ్ముని...ఇంత పదిలంగా దాచి పెట్టిన ఈ బ్యాంకు...పెద్ద బందిపోటు దొంగలా ఉంది. " కసిగా మనస్సులో గొణుక్కున్నాడు.

ఆ ప్రయత్నాన్ని ఆపేసి...ఆ తర్వాత...పెద్ద పెద్ద మేడల చుట్టూ..బంగ్లాల చుట్టూ...కాళ్ళరిగేలా...తిరిగి... తిరిగి..అలసి...అలసి..అలా..అలా వెతుకుతూనే ఉన్నాడు.

కత్తులు పట్టుకుని కాపలాదారులూ...వెక్కిరిస్తూ తాళం కప్పలూ...దొరికితే చీల్చి చెండాడే...ఆల్సేషన్ కుక్కలూ... ఎత్తైన కాంపౌండ్ గోడలూ...అన్నీ చూసి...చూసి..."దొంగతనం చెయ్యడం ఇంత కష్టమా...? ఇంత కంటే జైలు కెళ్లడమే సులభం" అనుకొన్నాడు. భద్రత, దోపిడీ...ఒక దాంతో ఒకటి పోటీ పడుతూ...అలా ...అలా...పెరిగి.. .పెరిగి...సింహాచలం లాంటి వాళ్ల కందనంత ఎత్తెదిగి పోయినట్టుగా ఉన్నాయ్.



నిరాశా, నిస్పృహలు నిలువెల్లా...ఆవహిస్తే, కళ్లు గిర్రున తిరుగుతోంటే, కాళ్లు పట్టు తప్పి పోతూంటే... ఆకలి...అంత కంతకూ...పెరిగి, నిస్సత్తువ...నీరసాన్ని పెంచితే...ఎటు పోతున్నాడో... తనకే తెలీని స్థితిలో...అలా. ..అలా..నడిచి...నడిచి...అలసి...సొలసి...చుట్టూ...ఒకసారి చూస్తే...

నగరానికి దూరంగా.. విసిరేయ బడ్డట్టున్న గుడిసెల మధ్యలో ఉన్నాడు.

ఓ గుడిసె దగ్గరకెళ్లి ఆశగా...తలుపు తోసి చూసాడు...కిర్రుమని శబ్దం చేస్తూ...తలుపు తెరుచుకొంది. అతని కళ్లు...ఆనందంతో మెరిసాయ్. "ఛ..అనవసరంగా...మేడల చుట్టూ...తిరిగి చచ్చాను" విసుక్కుంటూ అనుకొన్నాడు. లోపల ఓ చిన్న బుడ్డిదీపం...మిణుకు మంటూ వెలుగుతోంది. ఆ మసక వెలుతురులో...నేలమీద కూర్చొని ఒక స్త్రీ...అన్నం మెతుకులకి పట్టిన చీమలన్నింటినీ...దులిపి...దులిపి..నీళ్లు పోసుకొని... అన్నాన్ని కలుపుతోంది.

తలుపు చప్పడయ్యేసరికి...తల తిప్పి చూసింది.

తిన బోతోన్న అన్నం మీద...ఓ కంచాన్ని మూత పెట్టి...ఆతృతగా.. లేచి, చెయ్యి కడుక్కొని, పవిట సవరించుకొంటూ.."లోపలికి రండి" అంది.



నులక మంచాన్ని వాల్చి...మేకుకి తగిలించిన మల్లె పువ్వుల్ని తీసి తలలోతురుముకొనిమూలనున్న పౌడర్ డబ్బాని దులిపి...కొంచెం పౌడర్ని ముఖానికి పులుముకొని....ముసి ముసిగా నవ్వుతూ...

"లోపలికి రండి...!" మరోసారి అంది.

తనెక్కడికి వచ్చాడో..అర్థమయి..మతిపోయి...ఒణుకుతోన్న గొంతుతో నెమ్మదిగా....

"నేను ...దొంగని. దొంగంటే...నిజానికి ఏ దొంగతనమూ చెయ్యకుండానే...జైలు కెళ్లొచ్చిన దొంగని... ఇప్పుడు దోచుకొందామని ఇక్కడికి...వచ్చాను." అన్నాడు.

జవాబుగా...ఆమె నవ్వింది. తెరలు...తెరలుగా... అలలు...అలలుగా...ఏడుపులాంటి అంద వికారమైన నవ్వు నవ్వింది.

"నా దగ్గరేముంది...నువ్వు దోచుకు పోయేందుకు...?

రెండు మట్టి కుండలూ...నులకమంచం....పగిలిన అద్దం..పౌడర్ డబ్బా...తప్ప."

ఒళ్ళు ఒకళ్ల కమ్ముకొని బతికే దాన్ని. ఇదిగో...ఈ గాయాలు చూడు. ఎవరో స్టూడెంట్ కుర్రోళ్లు...ఒకడికని చెప్పి...తీసుకుపోయి...పదిమంది...తెల్లార్లూ... ఒళ్లంతా...రక్కి...రక్కి...ఏభై రూపాయలు చేతిలో పెట్టి.... ఇపుడే ఒదిలారు. నడిచొస్తూంటే... బీటు కానిస్టేబులు...అది గూడా లాక్కొని...ఏడ్చుకొంటూ...ఇంటి కొచ్చాను.. ..తెల్లారితే...ఈ గుడిసెకి అద్దె కట్టాలి. నువ్వు కష్టమర్వనుకొని సంబరపడ్డాను." ఏడుస్తూ...ఆమె చెప్పకొని పోతోంది.

అతను రెండు చేతులూ జోడించి..."ఆకలి... తిండి తిని...నాలుగు...రోజులయ్యింది." నెమ్మదిగా గొణుగుతున్నట్టు అన్నాడు.

ఆమె అతన్ని కూర్చోమంది. మూతపెట్టిన కంచం తీసి...సగం అన్నాన్ని అతనికి పెట్టి..."ఇది నంజుకో.." అంటూ చిన్న ఉల్లిపాయని అతని చేతిలో పెట్టింది.

ఆబగా తింటోన్న అతని వంకే...రెప్ప వేయకుండా...చూస్తోంది.

కళ్ల నిండా కోర్కెని నింపుకొని...'ఆ' ఆకలితో తన దగ్గర కొచ్చిన మగాళ్లనే...ఇంత వరకూ చూసింది.

పొట్ట చేత్తో పట్టుకు...ఆకలంటూ...ఆ గడప తొక్కిన మొట్టమొదటి మగాడు...అతనే.

"రేపంతా..ఇంక పస్తులే...నాకు" మనసులో అనుకొంది. అయినా ఆమె కళ్ల నిండా తృప్తి. తను కూడా..ఒక మనిషి ఆకలిని తీర్చి ఆదుకోగలిగానన్న..సంతృప్తి.

అతను తినడం పూర్తయింది. లేచి చెయ్యి కడుక్కొని...వెళ్లబోతూ...తిరిగి కృతజ్ఞతా పూర్వకంగా... రెండు చేతులు జోడించి...ఆమెతో అన్నాడు.

"చూడూ...నువ్వు ఇలా ఒళ్ళమ్ముకొని...ఎన్నాళ్లు బ్రతికినా...నీ కష్టాలు తీరవు. దొంగతనం వలన...నా కష్టాలు కూడా తీరతాయన్న నమ్మకం...నాకు లేదు.

ఎందుకంటే...మనకన్నా పెద్ద...పెద్ద...దొంగలూ, పతితలూ...రకరకాల పెద్ద మనుషుల రూపాల్లో...సమాజం నిండా...నిండిపోయి...తర తరాలుగా...దీన్ని దోచుకు తింటున్నారు." ఈ రాత్రి...నా చీకటి ప్రయాణంలో నేనేమేమి ...చూసానో..తెలుసా!

"ఢీ కొట్టిన లారీ దూసుకుపోతే...రక్తం మడుగులో...గిల గిలా కొట్టుకొంటోన్న యువకుడి మెడలో చైన్ కాజేసిన పోలీసుని చూసాను.

కొత్త సినిమాలో వేషం కోసం నిర్మాత ఇంట్లో దూరిన హీరోయిన్ కారుని చూసాను.

పసి కందుని, పరువుకి, బరువని తలచి...కాలువలో విసిరేసిన, కిరాతక తల్లిని చూసాను.

నన్ను లాకప్‌లో పెట్టిన మొదటి రోజు... నాతో పాటు ఆరుగురు...కుర్రోళ్లు...అంతా చదువుకొంటున్నవాళ్లే...అందులో ఒకడు...ప్రేమ నటించి.. అమ్మాయిని రూముకి పిలిస్తే..రాత్రంతా...ఆమెని మానభంగం...చేసి....చంపేసారట....ఒక్కడి ముఖంలో...పశ్చాత్తాపం లేదు. తెల్లారే సరికి ...వాళ్లంతా... వెళ్లిపోయారు...బెయిల్ మీద.... నేను ఒక్కడ్నే...జైల్లో మిగిలాను. సాక్ష్యాధారాలు దొరక్క...ఆ కేసు కూడా కొట్టేసారంట."

అతనిలో ఇంత ఆవేశాన్ని ఊహించని ఆమె...అవాక్కయి...అలా వింటూండి పోయింది. అతను తిరిగి చెప్పడం మొదలెట్టాడు.

"ఒకడు...కోట్లాది రూపాయల 'గడ్డి'ని మేసి గద్దెని పట్టుకు...వేలాడు తూంటాడు. ఇంకొకడు ప్రశ్న పత్రాల్నమ్ముకొని లక్షలు సంపాదిస్తూంటాడు. ప్రజాసేవ పేరుతో టోపీలు పెట్టేవాళ్లూ...జీతానికీ... జీవితానికీ మధ్య పొంతన కుదరనంత విలాసంగా బ్రతికేవాళ్లూ...వీళ్లంతా...పెద్ద మనుష్యులు. సాక్ష్యాధారాలు దొరకని... నిర్దోషులు."

"నువ్వూ...నేనూ....ఇంకా మనలాంటి దరిద్రులంతా...స్వేచ్ఛగా...సంతోషంగా బ్రతక గలగాలంటే... మనకో కొత్త ప్రపంచం...కావాలి. ఆ ప్రపంచంలో ఏ ఒక్కడూ..తన తెలివినో, అధికారాన్నో, బలాన్నో, ఆకర్షణనో... ఎరగా వేసి...ఇతరుల్ని దోచుకొనే...అవకాశం ఉండ కూడదు. ఎవ్వరి బ్రతుకు వాళ్లు నిర్భయంగా..నిర్మలంగా.. బ్రతికే..ఆ ప్రపంచానికి... ఏదైనా...దారుందేమో...నేను వెతుకుతాను." ఆవేశంగా అనేసి వెళ్లి పోతున్నాడతను. అతని వంక చూస్తూ తల దించుకొని...మౌనంగా...అనుకుందామె..

"ఇతను మళ్లా నా కోసం...వచ్చి...జీవితాంతం తోడుగా ఉండకూడదూ" అని.

అదే సమయానికి...అతను...మనసులో అనుకొన్నాడు.."నేను మళ్లా వస్తాను. నీకోసం...జీవితాంతం... నాతో కలిసి నడిచేందుకు...తీసుకువెళ్తాను. శుభాన్ని పలుకుతున్నట్టు...మత్తొదిలిన కోడిపుంజు..ఎక్కడి నుండో కొ క్క రో...కో... అంది.